ఓం శ్రీలక్ష్మీ నృసింహాయనమ:

శుభమస్తు అవిఘ్నమస్తు



# శ్రీ లక్ష్మీ నృసింహ స్తోత్రము

తెలుగు పద్య, అనువాదము – తాత్పర్య సహితము


అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.

# తొలి పలుకు

శ్రీలక్ష్మీనృసింహ స్తోత్రము భక్తులకు మిక్కిలి ప్రీతి పాత్రము మరియు నిత్య పారాయణాభిలషణీయము. ఇది శ్రీ శంకర భగవత్పాద విరచితము. అనన్య సాధ్యమైన కఠిన పదభూయిష్టమయిన ఈ స్తోత్రము చదువుటకు వినుటకు రుచి పూరితము.

దీని రచన గురించి భిన్నాభిప్రాయములు ఉన్నవి. అలాగే లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ అను మకుటమునకు కరావలంబమ్ అంటే చేతి నిమ్మని అర్థించుట యని కొంతమంది, చేయూత అనగా సహాయము నర్థించుట అని కొంతమంది సమర్థించు చున్నారు.

అట్లే ఒక కిరాతుడు శ్రీ శంకరాచార్యుని శక్తికి బలి ఇవ్వబోవునంతలో పద్మపాదుడను శిష్యుడు ప్రార్థించగా నృసింహుడు ఆ కిరాతకుని చీల్చి చంపగా ఆ లక్ష్మీ నృసింహుని చూచి ఆదిశంకరులు పులకితుడై ఒడలు మరచి ఆ స్వామిని స్తోత్రము చేసెననియు అదియె శ్రీ లక్ష్మీనృసింహ స్తోత్రమని కొందరి వాదన. వారందరూ కరావలంబమ్ అనగా చేయూత అనే అర్థము చెప్పుచున్నారు.

అయితే ఇందులోని శ్లోకములలో చాలావరకు సంసారమును కాలసర్పముతోనూ, భయంకర గజములతోనూ, అగ్నితోనూ, వలలతోనూ, వృక్షములతోనూ, అడవితోనూ,బావులతోనూ పోల్చి వానిలో చిక్కి బంధింపబడుచుంటిని మరణ బాధను అనుభవించుచుంటిని, భీతిల్లుచుంటిని నన్ను కాపాడుము అని ప్రార్థించుట చేత కిరాతకుని వృత్తాంతము నాకు అంత సమంజసముగా అనిపించుట లేదు. జ్ఞానులు క్షమించ గోరెదను. నేను చదివిన, విన్న ఇంకొక ఉదంతము దీనికి నప్పునని నా భావన.

మండనమిశ్రుడు కాశీ నగరమున ఒక గొప్ప తర్క విద్వాంసుడు. ఆయన సాక్షాత్ బ్రహ్మ అవతారము. ఉభయభారతి ఆయన భార్య. ఆమె సర్వశ: సరస్వతీ అవతారము. వారు అద్వైత సిద్ధాంతము ఖండించు తరి శ్రీ ఆదిశంకరులు తర్క మీమాంసలయందు ఒకరి నొకరు ఓడించుటకై వాగ్వివాదములు సలుపు చుండిరి. శంకరుడే జయించుచుండెను. అన్ని శాస్త్రములయందు ఆయనదే పై చేయి అవుచున్నది. ఇంతలో ఉభయభారతి కామశాస్త్రము నందు నీ ప్రావీణ్యము చూపమని శంకరుని ప్రశ్నింప సాగినది. ఆజన్మ బ్రహ్మచారి శంకరునకు కామశాస్త్రమునందు జ్ఞానమెట్లు కలుగును.

ఆమెను ఆరునెలలు గడువు ఇమ్మని సవినయముగా సెలవు తీసుకుని దివ్య చక్షువుల తిలకించి తను వేరు శరీరమున చేరిన గాని శృంగార జ్ఞానము బడయుటకు ననర్హుడనని తలచి పరకాయ ప్రవేశవిద్య ద్వారా తనువు వదలి ఒకరాజు గారు మరణించగా ఆయన శరీరమున తన ఆత్మను ప్రవేశపెట్టెను. శిష్యులకు ఆరు నెలల వరకు తన దేహమును ఖననము చేయక కాపాడవలసినదని ఆదేశించెను.

రాజు బ్రతుకుటచే అందరూ ఆనందించిరి. రాణి కూడా సంతసమున భర్తను కౌగిలించి ఆయనకు సేవలు చేసి విశ్రాంతికై అంత:పురమున ఉంచెను. ఆ రాజు శరీరముతో ఆ రాణి భార్యగా ఆయన సంసారము చేయుచూ కామశాస్త్ర ప్రావీణ్యతను సాధించి తర్కమున ఓడించు జ్ఞానమును సంపాదించెను. కానీ ఆయన ప్రవర్తన వింతగా యుండెను. రాణి ఆయన జ్ఞానము, భక్తి, పాండిత్యము చూచి మిక్కిలి వ్యాకులయైనదై ఆ శరీరము తన భర్తదే కానీ అందున్న జీవి వేరొకరని గ్రహించెను.

ఆ జీవి మరల ఆ దేహము వదలునని, మరల తనకు వైధవ్యము తథ్యమని గ్రహించిన ఆ రాణి ఏమి చేయుట అని ఆలోచించి ఇది ఎవరో మహాత్ముని పని అని తలచి బ్రాహ్మణ శవమేదైన

సంస్కారము జరుగక వదిలివేయబడుట రాజ్యమునకు అనర్థమనియు అట్టి బ్రాహ్మణుని శవము సంస్కార రహితమై దహింప బడక యున్న తక్షణము కాల్పింపవలెనని భటులకు ఆదేశమిచ్చెను. ఇది రహస్యముగా జరుగుట చేతను, ప్రతి దినము ప్రాయశ్చిత్తమునకై దైవ ధ్యానముతో విరాగియై యున్న రాజునకు తెలియదు.

దూతలు చివరకు ఆదిశంకరుని శరీరమును చూచి, శిష్యులు కాపాడుచున్న వైనమును రాణికెరిగించిరి. ఆమె వెంటనే ఆ శవమును కాల్చుమని ఆదేశించెను. రాజభటులు శిష్యులను బంధించి శంకరుని దేహమును అగ్నికి ఆహుతి చేయసాగిరి. అప్పుడు పద్మపాదుడు అను శిష్యుడు ఎట్లో తప్పించుకుని తన గురువుకు ఈ సంగతి విన్నవించెను. అప్పుడు వారు వెంటనే రాజుశరీరము వదలి పరకాయ ప్రవేశమున తన దేహమున తన ఆత్మను ప్రవేశపెట్టెను.

కాని అప్పటికే ఆ దేహమున చేతులు కాలిపోయెను. శరీరమున రోమములు అంటుకుని కాలిపోయినవి. (ఒక శ్లోకమున ఈ విషయము ప్రస్తావించ బడును గమనింపుడు) ఒక ప్రక్క శరీర బాధ ఒక ప్రక్క తను చేసిన పాపమునకు శిక్ష అనుభవించు చుంటినను పశ్చాత్తాపాగ్ని. వీటిలో జ్వలితుడైన ఆ సద్గురువు ఎవరిని వేడును? ఆగ్రహోదగ్రుడు,

అగ్నినే ప్రేల్చగల సమర్థుడు, దీనతతో ప్రార్థించిన బాలప్రహ్లాదుని క్షణములో విష సర్పముల విషమునుండి కాపాడిన ఆ నృసింహ రూపుడైన విష్ణుదేవుని ప్రార్థించెను. శ్రీ లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్ అని మొరపెట్టి స్తోత్రముచేసెను.

సంసారమను విషము ద్రావియుండుటచే పాపభీతిచే ఆర్తి నున్న తనను రక్షించమని కరుణతో తనకు కాలిన చేతుల నొసగుమని ప్రార్థించెను.

భక్త సులభుడయిన ఆ మహావిష్ణువు శివుని అవతారమయిన శంకరాచార్యుని రక్షించకుండునా! నరికిన మ్రోడు చివురించినట్లు ఆయనకు తిరిగి చేతులు మొలచుటయే గాక, తిరిగి ఆయన ఆత్మ చేసిన పాపము గూడా పరిహారమయినది.

తదుపరి ఆయన ఉభయభారతిని కామశాస్త్రపున తర్కమున ఓడించుటయూ, కాశీలో పీఠము నిలిపి అద్వైతమును స్థాపించుటయూ జరిగెను. అది అటుంచి భక్తులకు ఒక స్తోత్ర రత్నము లభించెను.

దీనియందు వేదాంతమే కాక భక్తిరసము ఉప్పొంగుచుండును. సంసార వృత్తమున పరిభ్రమించుచూ, పాప కర్మములు చేయుచూ

కర్మఫలమనుభవించుచూ, తిరిగి జన్మల నొంది మరల పాపము చేయుచూ ఇందేతిరుగాడు జీవన్మృతులకు ఈ స్తోత్రము దివ్యౌషధము లాంటిది. భక్తితో దీనిని చదువు వారికి కష్టములు తొలగుటయే కాక జన్మల బంధమంతరించునని భక్తుల నమ్మకము.

ఇక దీనిని తెలుగు పద్యములుగా వ్రాయుటకు ఒకే కారణము. తెలుగు పద్యాలు కంఠతా పట్టుట తేలిక. చదువుతున్నపుడు అర్థము చేసుకొనుట కూడా చాలా తేలిక. అర్థము కాని శ్లోకములు చదివి ఏదో చదివాం అనే ఆత్మ తృప్తికి బదులు తెలుగు పద్యములను రాగ యుక్తముగా చదివి అర్థం చేసికొంటూ ఆ లక్ష్మీనృసింహుని ప్రార్థించిన ఇంకా బాగుంటుందనే ఆలోచనతో ప్రతి శ్లోకమునూ చిన్న తేటగీతి పద్యముగా అనువదించితిని.

పద్యము చిన్నదగుటచేతనూ ప్రాసకోసం కొంత ప్రయాస పడవలసి వచ్చుట చేతనూ కొంత అనువాదార్థము మారి యుండవచ్చును. అందుచేత చిన్నవాడినని క్షమించమని నా మనవి. ఒక భగవత్ స్తోత్రము క్రింద దీనిని స్వీకరించి చదివి ఆ నృసింహుని కరుణ పొందగలరని నా భావన.

ఇక నేను కరావలంబమ్ అంటే చేతులిమ్మనే భావంతోనే వ్రాశాను. **లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబం అనే మకుటమును కరము విడు నాకు శ్రీలక్ష్మీనారసింహ** అని అనువదించాను. కొన్ని సంస్కృత పుస్తకములయందు శ్లోకముల వరుస మారినది. అందువలన నేను వ్రాసిన వరుస ఇంకొక పాఠ్యమునందు ఉండకపోవచ్చును.

ఇక ఆఖరి శ్లోకములు ఫలశ్రుతి ఇత్యాదివగుటచే అన్నీ కలిసి ఒక సీస పద్యమున కుదించితిని. వీటికి మకుటము మాతృక యందునూ అనువాదముననూ లేదు.

ఇక చదవండి. ఆనందించండి.

## అంకితం

ఆ॥ చిన్ననాటినుండి చేరికొల్చితి వాని
నేటికొచ్చె తరుణ మిటుల నాకు
ఆదిగురువుకిత్తు అంకితమ్మునుదీని
అతనికన్న ఎవరు అర్హులనెద.

*-*-*

# శ్రీ లక్ష్మీ నృసింహ స్తోత్రము

1. శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగీంద్ర భోగ మణిరంజిత పుణ్యమూర్తే
యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ధి పోత
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్॥

**తే॥ బ్రోవ పాలకడలినుండు పుణ్యమూర్తి!
సర్పమణికాంతులన్ వెల్గు చక్రపాణి!
సాధుహిత! నిత్యుడై భవజలధి దాట
కరము లిడు నాకు శ్రీలక్ష్మి నారసింహ.**

తా॥ పాల సముద్రమున పరుండి యుండు ఓ పుణ్యమూర్తీ ! ఆదిశేషుని పడగలమీది మణుల కాంతితో వెలిగిపోతున్న ఓ చక్రపాణీ! నిత్యుడవయి, శాశ్వతుడవయి, సాధువులకు హితుడవు రక్షకుడవు అయి భవజలధి దాటించగల ఓ లక్ష్మీనారసింహా నాకు కరముల నొసంగుము. కరుణతో చూడుము.

2. బ్రహ్మేంద్ర రుద్రమరుదర్క కిరీటకోటి
సంఘట్టితాంఘ్రి కమలామల కాంతి కాంత
లక్ష్మీలసత్కుచ సరోరుహ రాజహంస!
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ బ్రహ్మ ఇంద్రేశ మరుదర్క వరులు, తలలు**
**వంచి మొక్కంగ మణుల నీ పదము లెసగె**
**రమ కుచముల పద్మాలకే రాజహంస**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మినారసింహ.**

తా॥ బ్రహ్మ, ఇంద్ర, ఈశ, వాయు, సూర్యుల తలలు నీ పాదములను తాకునపుడు వారి కిరీటములందలి మణుల కాంతి చేత ఆ పాదములు వెలిగెను. లక్ష్మి స్తనములనబడే పద్మములకే రాజహంసవయిన ఓ ప్రభూ ! లక్ష్మి నరసింహా నాకు కరముల నొసంగుము. కరుణతో చూడుము.

3. సంసార ఘోర గహనే చరతో మురారే
మారోగ్ర భీకర మృగ ప్రవరార్దితస్య
ఆర్తస్య మత్సర నిదాఘ నిపీడితస్య
లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్॥

**తే॥ ఘోర సంసార వని యందు శౌరి! యుంటి**
**మారుడన్ భీకర మృగము చేరువాయె**
**ఆర్తుడను, మత్సరాగ్నిని అణచు స్వామి!**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మి నారసింహ.**

తా॥ అతి ఘోరమయిన సంసారమను అడవి యందు చిక్కుక పోయాను. ఓ శౌరీ! మన్మథుడు అను భయంకరమైన మృగము నాకు చేరువై పోయింది. బాధింపబడుతున్నాను. స్వామీ! నా మత్సరము అను అగ్నిని ఆర్పివేయుము. ఓ లక్ష్మీ నారసింహా నాకు కరములొసంగుము. కరుణ గనుము.

4. సంసార కూప మతిఘోర మగాధ మూలం
సంప్రాప్య దు:ఖశత సర్ప సమూకులస్య
దీనస్య దేవ కృపయా శరణాగతస్య
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్॥

**తే॥ ఘోర సంసారమను ఘన కూపమందు**
**పడితి, దు:ఖమ్ములను వేల ఫణులు నన్ను**
**కాటువేయునన్ ఆపదన్ కలత నుంటి,**
**కరము లిడు నాకు శ్రీ లక్ష్మి నారసింహ.**

తా॥ సంసారమను ఒక బాగా లోతైన బావిలో పడిపోయాను. దీనిలో దు:ఖములనే పాములు వేలకొద్దీ వున్నాయి. అవి కాటు వేస్తే కలిగే ఆపదను తలచుకొని నేను ఎంతో బాధ పడుతున్నాను. ఏ క్షణంలో ఏ ఆపద వస్తుందో తెలియని సంసార కూపం ఇది. ఓ లక్ష్మీ నరసింహా నాకు కరముల నొసంగుము. కరుణతో చూడుము.

5. సంసార సాగర విశాల కరాళ కామ
నక్ర గ్రహాగ్ర సన నిగ్రహాస్య
మగ్నస్య రాగ లసదూర్మి నిపీడితస్య
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ మునిగి సంసార జలధిలో మొసలి వంటి**
**ఘోర జలచరమ్ములు మ్రింగు గొప్ప భయము**
**రాగమను అలధ్వని బాధ మిగుల కలిగె**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ స్వామీ! నేను సంసారమను సాగరమున మునిగి వున్నాను. కోరికలనే మొసళ్ళ వంటి క్రూర జలచరములు నన్ను మ్రింగబోతున్నాయి. భయము ఎక్కువగుచున్నది. అనురాగ మను అలలు ముంచివేయుచున్నవి. ఈ బాధను నేను తట్టుకోలేక పోతున్నాను. ఓ లక్ష్మీనరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

6.	సంసార వృక్ష మఘబీజ మనన్త కర్మ
శాఖాయుతం కరణపత్ర మనంగపుష్పమ్
ఆరుహ్యా దు:ఖ జలధౌపతితో దయాళో
లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ విత్తు పాపాలె, శాఖలే విదిత కర్మ**
**లాకు లింద్రియాల్, మదనుడు అలరులయ్యె**
**పరగు సంసార వృక్షాన పడితి శౌరి!**
**కరము లిడు నాకు శ్రీ లక్ష్మినారసింహ.**

తా॥ ఓ ప్రభూ ఈ సంసారమను వృక్షమునకు విత్తనము పాపములే, చేయు కర్మలే కొమ్మలు, ఆకులు ఇంద్రియములు. మన్మథుడు పుష్పములు, ఇటువంటి ఈ వృక్షమునుండి జారి పడితి. దిక్కు తోచటం లేదు. ఓ లక్ష్మీ నరసింహా! నాకు కరములొసంగుము. కరుణతో చూడుము.

7. సంసార సర్ప విష దగ్ధ భయోగ్ర తీవ్ర
దంష్ట్రాగ్ర కోటి పరిదష్ట వినష్ట మూర్తే
నాగారి వాహన! సుధాబ్ధినివాస! శౌరే!
లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్॥

**తే॥ ఘోర సంసార విష సర్ప కోటి యొక్క**
**కోఱల విషాగ్ని నణగించు, శరణు శౌరీ!**
**గరుడ వాహన! క్షీర సాగర నివాస!**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మి నారసింహ.**

తా॥ ఓ శౌరీ! భయంకరమైన ఈ సంసార విష సర్పము నుంచి కాపాడుము. దీని కోఱల విషమను అగ్నిని ఆర్పివేయుము. శరణు వేడుతున్నాను. ఓ గరుడ వాహనా! క్షీరసాగర నివాసా! ఇటువంటి సర్పమునుంచి కాపాడగలవాడవు నీవు ఒక్కడివే. ఓ లక్ష్మీనరసింహా! నాకు కరములొసంగుము. కరుణతో చూడుము.

8. సంసార దావ దహనా కుల భీకరోరు
జ్వాలావళీభి రతిదగ్ధ తనూరుహస్య
త్వత్పాద పద్మ సరసీం శరణా గతస్య
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ స్వామి! సంసార దావాగ్ని జ్వాల చిక్కి**
**కాలె రోమాలు దేహమ్ము కాలుచుండె,**
**నీదు పదపద్మములె దిక్కు నీవె శరణు**
**కరము లిడు నాకు శ్రీ లక్ష్మి నారసింహ.**

తా॥ ఓ వరదా! సంసారమను అగ్నియొక్క బలమైన జ్వాలల యందు చిక్కి నా శరీరముపై రోమాలు కాలిపోయాయి. దేహము కూడా కాలుచున్నది. స్వామీ నీ పాద పద్మముల రక్షణ ఈయవయ్యా ఓ లక్ష్మీనారసింహ నాకు కరములొసంగుము కరుణతో చూడుము.

9. సంసారజాల పతితస్య జగన్నివాస
సర్వేంద్రియార్థ బడి శాగ్ర ఝషోపమస్య
ప్రోత్కమ్పిత ప్రచుర తాలుక మస్తకస్య
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ నేను సంసారమను వలన్ నీల్గుచుంటి**
**చిక్కి ఇంద్రియ గాలాన చేపవోలె,**
**చిట్లె దవడలున్, తలలేపి ఛిద్రమయితి**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మి నారసింహ.**

అ॥ ఓ స్వామీ! సంసారమనే ఒక వలలో నేను చిక్కుకొని బాధ పడుతున్నాను. ఇంద్రియములను గాలమున చిక్కిన చేపవలె నేను తలపైకెత్తి దవడలు చిట్లి ముక్కలు ముక్కలయి బాధ పడుతున్నాను. ఓ లక్ష్మి నరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

10. సంసార భీకర కరీంద్ర కరాభిఘాత
నిష్పీడ్యమాన వపుష: సకలార్తి నాశ
ప్రాణ ప్రయాణ భవభీతి సమాకులస్య
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ ఘోర సంసారమను గొప్పకరికి జిక్క,**
**బాది తొండముతో, తొక్కి బాధ గరిపె**
**ప్రాణ భీతిచే అల్లాడి భయము నుంటి**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ ఓ ప్రభూ! సంసారమను ఒక ఘోరమైన ఏనుగు పట్టుకొని తన తొండముతో బాది నన్ను తొక్కుతున్నది. నా శరీరము బాధపడుతోంది. ప్రాణము పోవునను భయము చేత నేను అల్లాడుతున్నాను. భయముతో ఉన్నాను. ఓ లక్ష్మీనరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

11. అంధస్య మే హృత వివేక మహాధనస్య
చోరైర్మహా బలిభిరిన్ద్రియ నామధేయైః
మోహాంధకార కుహరే వినిపాతితస్య
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ చెలగు ఇంద్రియాలను దొంగలిలను బలిమి**
**నా వివేకమన్ ధనములన్ నన్ను దోచ**
**గుడ్డినైతిని, మోహాంధ గుహల బడితి**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ ఓ ప్రభూ! ఇంద్రియాలనే దొంగలు చెలరేగి బలముతో నా వివేకమనే ధనమును దోచుకుని నన్ను అజ్ఞానమనే చీకటి గుహయందు పడత్రోసిరి. ఆ చీకటిలో దిక్కు తోచకున్నది. ఓ లక్ష్మీనరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

12. లక్ష్మీపతే! కమలనాభ! సురేశ విష్ణో
యజ్ఞేశ యజ్ఞ మధుసూదన విశ్వరూప
బ్రహ్మణ్య కేశవ జనార్దన వాసుదేవ
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ కమలనాభుడా! సురనాథ! కమల నాథ!**
**విష్ణు! మధువైరి! యజ్ఞేశ! విశ్వ రూప!**
**కేశవా! యజ్ఞ! బ్రహ్మణ్య! వాసు దేవ!**
**కరము లిదు నాకు శ్రీలక్ష్మినారసింహ.**

తా॥ ఓ కమలనాభా, సురనాధా, కమల కాంతా, విష్ణూ, మధువైరీ యజ్ఞములకు అధినాధుడా, విశ్వ రూప, కేశవ, బ్రహ్మణ్య, యజ్ఞ, వాసుదేవ ఓ లక్ష్మీ నరసింహా నాకు కరము లొసంగుము కరుణతో చూడుము.

13. సంసార సాగర నిమజ్జన ముహ్యమానం
దీనం విలోకయ విభో కరుణానిధే మామ్
ప్రహ్లాద ఖేద పరిహార పరావతార
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ ఇలను చిక్కితి సంసార జలధి యందు**
**దీనుడను దయానిధి! చూపు దేవ! దయను**
**బాల ప్రహ్లాదు దు:ఖాగ్ని బాపు దేవ!**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ ఓ దయానిధీ! నేను సంసార సాగరమందు చిక్కుకపోయాను. దీనుడను. ఓ దేవ! దయను చూపుము. బాలుడైన ప్రహ్లాదుని దు:ఖమను అగ్నిని ఎట్లు బాపితివో అట్లే దీనుడనై ఈ సంసార సాగరమున చిక్కిన నన్ను కాపాడుము. ఓ లక్ష్మీనరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

14. సంసార యూధగజ సంహతి సింహదంష్ట్రా
భీతస్య దుష్ట మతిదైత్య భయంకరేణ
ప్రాణ ప్రయాణ భవభీతి నివారణేన
లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ చీల్చ సంసార గజములన్ సింహరూప!**
**కోఱలతొ రూపు అసుర భీకరము దేవ!**
**భీతి పోగొట్టు ప్రాణమ్ము వీడునపుడు**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ ఓ దేవ! ఈ సంసారమను చెలరేగెడి ఏనుగు గుంపులను చీల్చ కలిగిన సింహమవు నీవు. కోఱలతో నీ రూపము భయంకరమై రాక్షసులకు భయము కొల్పునది. నా ప్రాణ భయము పోగొట్టుము. నీవే నాకు ప్రాణదాతవు. ఓ లక్ష్మీ నరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

15. సంసార యోగి సకలేప్సిత నిత్య కర్మ
సంప్రాప్య దు:ఖ సకలేంద్రియ మృత్యునాశ
సంకల్ప సింధుతనయా కుచకుంకుమాంక
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ కర్మ, సంసారమందున, గరపు కోర్కె**
**నాశకర కామితము లవినాశకరుడ!**
**వరద! శ్రీ కుచకుంకుమాభరణ వక్ష!**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మినారసింహ.**

తా॥ ఓ వరదా! ఈ సంసారమునకు ముఖ్య కారణమే కోరికలు. ఆ కోర్కెలు నాకు నాశనము కలిగించు చున్నవి. లక్ష్మీదేవి స్తనములపై యున్న కుంకుమ అంటిన వక్షస్థలముకల ఓ ప్రభూ! లక్ష్మీనరసింహా! నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

16. బద్ధ్వా కణ్ఠైఃమయభటా బహు భర్త్సయన్తి
కర్షన్తి యత్ర భవపాశశతైర్యదా మామ్
ఏకాకినం పరవశం చకితం దయాళో
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ ఎన్నొ పాశాల యమభటుల్ నన్ను పట్టి**
**ఈడ్చు కొనిపోవు దారిలో ఏడ్చునాకు**
**వేరు దిక్కేది? ఒంటరిన్ పరుల వశిని**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మినారసింహ.**

తా॥ ఓ ప్రభూ! నన్ను యమభటులు ఎన్నో పాశాలతో పట్టి బంధించి ఈడ్చుకొని పోతుంటే ఆ దారిలో బాధ పడుతూ ఏడ్చునట్టి నాకు వేరే దిక్కెవరు. ఒంటరిగా పరాయివారి వశమైపోయి బాధ పడేనాకు నీవు తప్ప దిక్కులేదు. ఓ లక్ష్మి నరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

17. ప్రహ్లాద నారద పరాశర పుండరీక
వ్యాసాది భాగవత పుంగవ హృన్నివాస
భక్తా నురక్త పరిపాలన పారిజాత
లక్ష్మీ నృసింహ మమదేహి కరావలంబమ్ ॥

**తే॥ వ్యాస ప్రహ్లాద నారదు వంటి భాగ**
**వతుల హృదయాల వసియించి వారి బ్రోచు**
**భక్త వాత్సల్య! పాలించు పారిజాత**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ ఓ వరదా! వ్యాసుడు, ప్రహ్లాదుడు, నారదుల వంటి భాగవతుల హృదయములయందు నివసించి వారిని కాపాడు వాడివి. భక్తుల యందు ప్రేమకల వాడివి. వారిని పరిపాలించి కాపాడే పారిజాత వృక్షమువంటి పెన్నిధివి. ఓ లక్ష్మీనరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

18. ఏకేన చక్ర మపరేణ కరేణ శంఖ
మన్యేన సింధుతనయా మవలంబ్య తిష్ఠన్
వామే తరేణ వరదాభయపద్మ చిహ్నం
లక్ష్మీనృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ ఓ చతుర్భుజా! శంఖము నొక్క చేత**
**చక్ర మొక చేత, కుడిచేత శరణ మిచ్చి**
**వామహస్తాన లక్ష్మినే వరద! దాల్చి**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మినారసింహ.**

తా॥ ఓ చతుర్భుజుడా! ఒకచేత శంఖము, ఒకచేత చక్రము. కుడిచేత అభయమునిచ్చి నీ ఎడమ చేతితో లక్ష్మీ దేవినే దగ్గరకు తీసుకుని కూర్చోపెట్టుకున్నావు. అట్టి ఓ లక్ష్మీనరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

19. ఆద్యన్త శూన్య మజమవ్యయ మప్రమేయ
మాదిత్య రుద్ర నిగమాది నుతప్రభావం
త్వామ్బోధిజాస్య మధులోలుప మత్తభృంగం
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ నాస్తి ఆద్యంతములు జన్మనాశనములు**
**నిగమ ఆదిత్య రుద్రులు నిన్ను పొగడ**
**శ్రీముఖాంబుజా మధులోల భ్రమర నీవు**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మినారసింహ.**

తా॥ ఓ ప్రభూ నీకు ఆది, అంతము, జన్మ మరణములు లేవు. వేదములు సూర్యుడు, రుద్రుడు మీ మహిమను పొగడు చున్నారు. లక్ష్మీదేవి ముఖ పద్మమునందలి తేనెను త్రాగు కోర్కెలగల తుమ్మెద వంటివాడా! ఓ లక్ష్మీ నరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

20. వారాహరామ నరసింహ రమాది కాంతా
క్రీడా విలోల విధి శూలి సుర ప్రవన్ద్య
హంసాత్మకం పరమ హంస విహారలీలం
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ స్వామి! వారాహ, నరసింహ, రామ రూప**
**శ్రీసహిత కాంత క్రీడితా, బ్రహ్మ హరుల**
**పూజితా, యోగి హృదయేశ, పుణ్యమూర్తి**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ ఓ ప్రభూ! నీవు వరాహ, శ్రీరామ, నరసింహ అవతార స్వరూపుడవు. నీవే పరమహంసవు. లక్ష్మీ దేవితో కూడిన స్త్రీలతో కేళీ విలాసంతో గడిపే ఓ పుణ్య రూప! నీవు శివ బ్రహ్మలచే పూజించ బడే వాడివి. యోగుల హృదయాధినాధుడా ఓ లక్ష్మీ నరసింహా నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

21. ప్రహ్లాద మానస సరోజ విహార భృంగ
గంగాతరంగ ధవళాంగ రమాస్థితాంగ
శృంగార సంగర కిరీట లసద్వరాంగ
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబమ్ ॥

**తే॥ బాల ప్రహ్లాద హృత్పద్మ భ్రమర, అలరె**
**శ్రీహృదిన్, గంగ అల బోలు శ్వేతవర్ణ**
**దేహ, శృంగార రసతేజ, సహకిరీట**
**కరము లిడు నాకు శ్రీలక్ష్మీనారసింహ.**

తా॥ ఓ దేవా! నీవు బాల ప్రహ్లాదుని హృదయమనే పద్మమునందు వసించు తుమ్మెదవు. లక్ష్మీనీ హృదయమందే ఉండును. గంగాతరంగముల వలె తెల్లని దేహచ్ఛాయగల దేవా. శృంగార రస తేజా, కిరీట ధారీ, ఓ లక్ష్మీ నృసింహ నాకు కరము లొసంగుము. కరుణతో చూడుము.

22. మాతా నృసింహశ్చ పితానృసింహ:
భ్రాతా నృసింహశ్చ సఖా నృసింహ:
విద్యా నృసింహశ్చద్రవిణం నృసింహ:
స్వామీ నృసింహ స్సకలం నృసింహ ॥

23. శ్రీ శంకరార్య రచితం సతతం మనుష్య:
స్తోత్రం పఠేదిహతు సర్వగుణ ప్రసన్నం
సద్యోవిముక్త కలుషో మునివర్యగణ్యో
లక్ష్మీపతే: పదము పైతి సనిర్మ లాత్మా ॥

24. యన్మాయయార్జిత వపు: ప్రచుర ప్రవాహ
మగ్నార్త మర్త్య నివహేషు కరావలంబమ్
లక్ష్మీ నృసింహ చరణాబ్జ మధువ్రతేన
స్తోత్రంకృతం శుభకరం భువి శంకరేణ ॥

25. శ్రీమన్నృసింహవిభవే గరుడధ్వజాయ
తాపత్రయోపశమనాయ భవౌషధాయ
తృష్ణారి వృశ్చిక జలాగ్ని భుజంగ రోగ
క్లేశ వ్యయాయ హరవే గురవే నమస్తే ॥

సీ॥ తల్లియున్ తోబుట్టు తండ్రియున్ సఖుడీవు
నాకు విద్య ధనమ్ము నారసింహ!
శంకరాచార్యుండు సద్గురు రచనయౌ
స్తవమునిద్దానినిన్ చదువు వారు
యోగుల కాంక్షితమగు విష్ణుపురిచేరి
పరిశుద్ధులై పొంది పాపముక్తి
మాయాంధకారాన మగ్గి జన్మలనొందు
బాధ తరింతురు భక్తి కలుగు

తే॥ ఘనుడవై లక్ష్మీనరసింహ గరుడకేత!
అనఘ! సంసార రోగాల ఔషధమవు
శత్రు తృష్ణాగ్ని వృశ్చికా సర్ప భీతి
పోవ రక్షించు, భక్తుల బ్రోవుమయ్య.

తా॥ ఓ నరసింహా! తల్లివీ, తండ్రివీ, తోబుట్టువవూ, సఖుడవూ నీవే. నాకు విద్య ధనమూ కూడా నీవే. శ్రీ శంకరాచార్య సద్గురుడు రచన చేసిన ఈ స్తోత్రము చదివిన వారు యోగులు కోరుకునే వైకుంఠము చేరి పరిశుద్ధులై పాప విముక్తి పొందుతారు. ఆ పరమాత్మ మాయలో చిక్కి ఆ అంధకారములో పాప పుణ్యాలు చేస్తూ, వాటికి ఫలము ననుభవించడానికి జన్మల తర్వాత

జన్మల పొందుతూనే మగ్గిపోయే బాధ నుంచి తరియించగల భక్తి నివ్వగలిగిన స్తోత్రమే ఇది. ఘనుడవైన ఓ లక్ష్మీ నరసింహా ఓ గరుడధ్వజా, ఓ పుణ్యమూర్తీ, పాప రహితుడా ఈ సంసార మనే రోగమునకు దివ్యమైన ఔషధము నీవే. మమ్ము శత్రువులు, దప్పిక, అగ్ని, తేళ్ళు పాముల వంటి విషజీవుల బాధ నుంచి కాపాడి రక్షించుము. స్వామీ నీకు వందనములు. మమ్ము బ్రోవుము.

శ్రీ శంకర భగవత్పాదుల విరచితమైన

# శ్రీ లక్ష్మీ నృసింహ స్తోత్రము

ఇంతటితో సమాప్తము.

సర్వం శ్రీ కృష్ణార్పణమస్తు